# తీజ్ మన పండుగ -- మన సంస్కృతి -- మన అస్తిత్వం

## గిరిజనుల ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక -- తీజ్ పండుగ

**ఒక సమాజం తన సంస్కృతిని కాపాడుకున్నప్పుడే తన అస్తిత్వాన్ని కాపాడుకోగలదు." తెలంగాణ రాష్ట్ర వ్యాపితంగా గిరిజనులు తీజ్ ను రాష్ట్ర పండుగగా గుర్తిచాలని డిమాండ్ ముందుకు వస్తుంది**

**తీజ్ కు రాష్ట్ర పండుగ గుర్తింపు కల్పించడం గిరిజనుల హక్కు. వారికి ఇచ్చే గౌరవం.**

భారతదేశం అనేక భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, జీవన విధానాల సమాహారం. ఈ వైవిధ్యంలో గిరిజన సమాజాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. అడవులు, కొండలు, ప్రకృతి, వ్యవసాయం, పశుపోషణ, సామూహిక జీవనం, ఆచారాలు, పాటలు, నృత్యాలు, పండుగలు---ఇవన్నీ గిరిజనుల జీవన సంస్కృతిలో విడదీయరాని భాగాలు. అలాంటి గొప్ప గిరిజన సాంస్కృతిక సంప్రదాయాల్లో తీజ్ పండుగకు విశిష్టమైన స్థానం ఉంది.

తీజ్ పండుగ కేవలం ఒక మతపరమైన లేదా కుటుంబపరమైన వేడుక కాదు. ఇది గిరిజనుల సామాజిక ఐక్యత, మహిళల పాత్ర, ప్రకృతితో అనుబంధం, సాంప్రదాయ జీవన విధానం, యువత భాగస్వామ్యం, సమాజపు సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. అందువల్ల తీజ్ పండుగను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా "రాష్ట్ర గిరిజన పండుగ"గా గుర్తించి, రాష్ట్ర స్థాయిలో నిర్వహించాల్సిన అవసరం ఉంది.

### తీజ్ అంటే ఏమిటి?

తీజ్ పండుగముఖ్యంగా తెలంగాణలోని లంబాడీ/బంజారా గిరిజన సమాజంలో ఎంతో ఉత్సాహంగా జరుపుకునే సాంప్రదాయ పండుగ. ప్రాంతానుసారం ఆచారాలు, పాటలు, పూజా విధానాల్లో బ్రాహ్మణ పూజారుల జోక్యం లేకుండా గిరిజనులే పూజారులుగా జరుపుకునే పండుగ ప్రకృతి, సంతానం, కుటుంబ సౌభాగ్యం, పంటల సమృద్ధి, సామాజిక శ్రేయస్సు వంటి భావనలు ఈ పండుగతో ముడిపడి ఉంటాయి.

ముఖ్యంగా యువతులు, మహిళలు తీజ్ వేడుకల్లో కీలక పాత్ర పోషిస్తారు. ప్రత్యేకమైన సంప్రదాయ దుస్తులు ధరించడం, పాటలు పాడటం, నృత్యాలు చేయడం, సంప్రదాయ ఆచారాలను నిర్వహించడం ద్వారా తమ సంస్కృతిని తరతరాలకు అందిస్తున్నారు.

తీజ్ సందర్భంగా ఏర్పడే సామూహిక వాతావరణం గిరిజన సమాజంలో "నేను" కంటే "మనం" అనే భావనకు ప్రాధాన్యతనిస్తుంది.గిరిజన సంస్కృతికి అద్దం పట్టే పండుగ

తీజ్. ఈ పండుగలో గిరిజనుల జీవన తత్వం ప్రతిబింబిస్తుంది. ప్రకృతిని కేవలం వనరుగా కాకుండా జీవన భాగస్వామిగా చూసే దృక్పథం గిరిజన సంస్కృతిలో బలంగా ఉంటుంది. అడవి, భూమి, నీరు, చెట్లు, పంటలు, పశువులు---ఇవన్నీ వారి జీవనంతో ముడిపడి ఉంటాయి.

అందువల్ల తీజ్ వంటి పండుగలు ప్రకృతితో గిరిజన సమాజానికి ఉన్న చారిత్రక సంబంధాన్ని గుర్తుచేస్తాయి.

నేటి ప్రపంచంలో పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం, ప్రకృతి సంరక్షణ గురించి విస్తృతంగా చర్చ జరుగుతున్న సమయంలో గిరిజనుల సాంప్రదాయ జీవన విధానంలో ఉన్న ప్రకృతి అనుకూల విలువలను సమాజం గుర్తించాల్సిన అవసరం ఉంది.

ద

### మహిళల పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం

తీజ్ పండుగలో గిరిజన మహిళల పాత్ర అత్యంత ముఖ్యమైనది. పండుగ ఏర్పాట్ల నుంచి సంప్రదాయ ఆచారాలు, పాటలు, నృత్యాలు, సామూహిక కార్యక్రమాల వరకు మహిళలు చురుకుగా పాల్గొంటారు.

ఇది కేవలం వినోదం కాదు. మహిళలు తమ పెద్దల నుంచి నేర్చుకున్న పాటలను, ఆచారాలను, సంప్రదాయాలను తరువాతి తరానికి అందించే సాంస్కృతిక వారసత్వ.

అందువల్ల తీజ్ పండుగకు రాష్ట్ర స్థాయి గుర్తింపు ఇవ్వడం అంటే గిరిజన మహిళల సాంస్కృతిక పాత్రకు కూడా గౌరవం ఇవ్వడమే.

### పాటలు, నృత్యాలు -- జీవించి ఉన్న చరిత్ర

గిరిజన సమాజానికి లిఖిత చరిత్ర కంటే మౌఖిక సంప్రదాయానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. వారి పాటలు, కథలు, సామెతలు, నృత్యాలు తరతరాల చరిత్రను మోస్తాయి.

తీజ్ సందర్భంగా పాడే సంప్రదాయ పాటలు, చేసే నృత్యాలు గిరిజనుల జీవన అనుభవాలను ప్రతిబింబిస్తాయి. ప్రేమ, కుటుంబం, ప్రకృతి, వ్యవసాయం, సామాజిక సంబంధాలు, సంతోషం, బాధ వంటి అనేక భావనలు వాటిలో కనిపిస్తాయి.

కాబట్టి తీజ్ పండుగను ప్రోత్సహించడం అంటే ఒకరోజు వేడుకను ప్రోత్సహించడం కాదు; అంతరించిపోతున్న మౌఖిక సాంస్కృతిక సంపదను సంరక్షించడం.

### యువతకు సంస్కృతిని పరిచయం చేసే వేదిక

ప్రపంచీకరణ, పట్టణీకరణ, ఆధునిక జీవనశైలి ప్రభావంతో అనేక సంప్రదాయాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ముఖ్యంగా యువత తమ స్వంత సాంస్కృతిక మూలాల నుంచి దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోంది.

ఇలాంటి సమయంలో తీజ్ పండుగ యువతకు తమ మూలాలను గుర్తుచేసే వేదికగా ఉంటుంది.

యువత తీజ్ పాటలు, నృత్యాలు, సంప్రదాయ దుస్తులు, కళారూపాల్లో పాల్గొంటే వారిలో సాంస్కృతిక ఆత్మగౌరవం పెరుగుతుంది. ఆధునికతను స్వీకరిస్తూనే తమ మూలాలను కాపాడుకోవడానికి ఇది దోహదపడుతుంది.

### సామాజిక ఐక్యతకు తీజ్ ఒక వేదిక

గిరిజన తండాల్లో తీజ్ పండుగ సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది. కుటుంబాలు, బంధువులు, యువత, పెద్దలు కలిసి వేడుకల్లో పాల్గొంటారు.

కుల, ఆర్థిక, కుటుంబ భేదాలకు అతీతంగా ఒకే వేదికపై కలిసి పండుగ జరుపుకోవడం సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తుంది.

అందువల్ల తీజ్ పండుగకు రాష్ట్ర స్థాయి గుర్తింపు ఇవ్వడం ద్వారా గిరిజన సమాజం యొక్క సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తుంది

రాష్ట్ర పండుగగా ఎందుకు గుర్తించాలి?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని వివిధ సమాజాల చరిత్ర, సంస్కృతి, కళలకు గుర్తింపు కల్పించాల్సిన బాధ్యత మరింత పెరిగింది.

గిరిజనులు తెలంగాణ సామాజిక నిర్మాణంలో కీలకమైన భాగం. వారి సంస్కృతి రాష్ట్ర సాంస్కృతిక వైవిధ్యానికి విలువైన సంపద.

కాబట్టి తీజ్‌కు రాష్ట్ర స్థాయి గుర్తింపు ఇవ్వడానికి కొన్ని ముఖ్యమైన కారణాలు ఉన్నాయి గిరిజనుల సాంస్కృతిక అస్తిత్వాన్ని గుర్తించడం.లంబాడీ/బంజారా సంప్రదాయాలను పరిరక్షించడం.

మహిళల సాంస్కృతిక పాత్రను గౌరవించడం. యువతలో సాంస్కృతిక చైతన్యాన్నిపెంపొందించడం. సంప్రదాయపాటలు, నృత్యాలు, కళారూపాలను సంరక్షించడం. గిరిజన తండాల్లో సామాజిక ఐక్యతను బలోపేతం చేయడం. తెలంగాణ సాంస్కృతిక వైవిధ్యాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పడం. గిరిజన కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడం. గిరిజన సంస్కృతిపై పరిశోధనకు ప్రోత్సాహం ఇవ్వడం. గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచడం. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన చర్యలు తీజ్‌ను కేవలం అధికారికంగా ప్రకటించడం మాత్రమే కాకుండా దాని పరిరక్షణకు శాశ్వత కార్యక్రమాలు చేపట్టాలి

గిరిజన సంస్కృతి -- కేవలం మ్యూజియంలో ఉండే వస్తువు కాదు

గిరిజన సంస్కృతిని మ్యూజియంలలో ప్రదర్శించే వస్తువుగా మాత్రమే చూడకూడదు. అది జీవించి ఉన్న సంస్కృతి.తీజ్ పాట పాడే యువతి, సంప్రదాయ నృత్యం చేసే యువకుడు, తండాలో పండుగ కోసం కలిసే కుటుంబాలు---వీళ్లందరూ ఆ సంస్కృతికి వారసులు.

అందువల్ల గిరిజన సంస్కృతి పరిరక్షణ అంటే గిరిజన సమాజానికి వారి జీవన హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక గౌరవం, సాంస్కృతిక హక్కులకు గుర్తింపు ఇవ్వడం కూడా.అభివృద్ధితో పాటు అస్తిత్వం కూడాఅవసరంగిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి, గృహాలు, తాగునీరు వంటి అభివృద్ధి అవసరాలు ఎంత ముఖ్యమో, వారి సాంస్కృతిక అస్తిత్వాన్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం.

అభివృద్ధి పేరుతో ఒక సమాజం తన భాషను, పాటలను, నృత్యాలను, సంప్రదాయాలను కోల్పోతే ఆ అభివృద్ధి అసంపూర్ణమే.

అందువల్ల గిరిజన సంక్షేమ విధానాల్లో ఆర్థిక, సామాజిక అభివృద్ధితో పాటు సాంస్కృతిక హక్కులకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలి.

### తీజ్ -- గిరిజన ఆత్మగౌరవానికి ప్రతీక

తీజ్ పండుగ గిరిజనుల జీవన విధానానికి, వారి సంస్కృతికి, వారి చరిత్ర.ఒక సంస్కృతి.ఒక సామూహిక జ్ఞాపకం.ఒక అస్తిత్వం.ఒక ఆత్మగౌరవ ప్రకటన.తెలంగాణ ప్రభుత్వం తీజ్ పండుగకు రాష్ట్ర స్థాయి గుర్తింపు కల్పిస్తే అది కేవలం ఒక పండుగకు ఇచ్చే గౌరవం కాదు; తెలంగాణ గిరిజన సమాజం యొక్క చరిత్రకు, సంస్కృతికి, మహిళలకు, యువతకు, కళాకారులకు, వారి సామూహిక అస్తిత్వానికి ఇచ్చే గౌరవం.

తెలంగాణ సాంస్కృతిక వైవిధ్యానికి గిరిజన సంస్కృతి ఒక అమూల్యమైన సంపద. ఆ సంపదను సంరక్షించడం ప్రభుత్వం, సమాజం, ప్రజాసంఘాలు, గిరిజన సంస్థలు, యువత అందరి బాధ్యత.

అందుకే తీజ్ పండుగను తెలంగాణ రాష్ట్ర పండుగగా అధికారికంగా గుర్తించాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో తీజ్ ఉత్సవాలను నిర్వహించి గిరిజన కళాకారులు, మహిళలు, యువతను భాగస్వామ్యం చేయాలి.తీజ్‌కు గుర్తింపు అంటే గిరిజన సంస్కృతికి గుర్తింపు.గిరిజన సంస్కృతికి గుర్తింపు అంటే గిరిజనుల ఆత్మగౌరవానికిగుర్తింపు.ఆత్మగౌరవానికి గుర్తింపు అంటే సమానత్వం,సామాజిక న్యాయానికి ఒక ముందడుగు.

### గిరిజనులు చేస్తున్న డిమాండ్లు

తీజ్ పండుగను తెలంగాణ రాష్ట్ర గిరిజన సాంస్కృతిక పండుగగా అధికారికంగా గుర్తించాలి.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అధికారికంగా తీజ్ ఉత్సవాలు నిర్వహించాలి.

ప్రతి జిల్లాలో తీజ్ సాంస్కృతిక ఉత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

గిరిజన కళాకారులకు గౌరవ వేతనం, పురస్కారాలు అందించాలి.

తీజ్ పాటలు, నృత్యాలు, ఆచారాలను డాక్యుమెంట్ చేసి సాంస్కృతిక ఆర్కైవ్ ఏర్పాటు చేయాలి.

పాఠశాలలు, కళాశాలల్లో గిరిజన సంస్కృతిపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి.

గిరిజన యువతకు సంప్రదాయ కళారూపాల్లో శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

గిరిజన సంస్కృతి, చరిత్రపై విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలి.



వ్యాస రచన
మాలోతు సాగర్
సెల్ నెంబర్ 7013805411

---

## ఆదర్శ పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**తెలుగు గళం న్యూస్ పెద్దవడుగూరు ఆగస్టు 28**



పెద్దవడుగూరులో గల ఆదర్శ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కే. నారాయణ రావు మాట్లాడుతూ రక్షా బంధన్ (రాఖీ పౌర్ణమి) అనేది అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల మధ్య ఉండే పవిత్రమైన బంధానికి,నిరంతర ప్రేమకు ప్రతీకగా జరుపుకునే గొప్ప భారతీయ పండుగని, శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున ఈ పండుగను దేశవ్యాప్తంగా ఎంతో వైభవంగా జరుపుకుంటారని, 'రక్షా' అంటే రక్షణ, 'బంధన్' అంటే కట్టడం. అన్నకు రాఖీ కట్టడం ద్వారా, అతను తనను జీవితాంతం అన్ని కష్టాల నుండి రక్షిస్తాడనే నమ్మకం సోదరిలో కలుగుతుంది. సోదరుడు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని సోదరి మనస్ఫూర్తిగా కోరుకునే పవిత్రమైన రోజు ఇదని ఈ పండుగ యొక్క ముఖ్య విశేషాలను పిల్లలకు వివరించారు.అనంతరం చిన్నారులు రాఖీలు కడుతూ మిఠాయిలు తినిపించి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కే. నారాయణ రావు మరియు ప్రిన్సిపాల్ కే. లహరీ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

---

## ఘనంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం

**ధర్మసాగర్ (తెలుగు గళం) ఆగస్టు 28:** ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీ సమీపంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు విహెచ్పిఎస్ మండల అధ్యక్షులు మాచర్ల బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ హాజరై మాట్లాడారు. గతంలో వికలాంగులను సమాజం పట్టించుకోని పరిస్థితులు ఉండేవని, కనీసం కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలోకి కూడా రానివ్వకుండా పక్క గదుల్లో ఉంచే పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు.అలాంటి పరిస్థితుల్లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వికలాంగుల హక్కుల పోరాట సమితిని ఏర్పాటు చేసి వికలాంగులను ఏకం చేసి, వారి హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ఆ ఉద్యమాల ఫలితంగా వికలాంగులకు పెన్షన్ సాధించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తొలుత రూ.500గా ఉన్న పెన్షన్‌ను రూ.2,000కు, అనంతరం రూ.4,000కు పెంచేలా పోరాటం చేసినట్లు తెలిపారు.వికలాంగులకు పెన్షన్ అందడం వల్ల వారి కుటుంబ సభ్యులు వారిని మరింత ఆదరించి మూడు పూటలా అన్నం పెట్టి చూసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే ప్రస్తుత అవసరాలకు పెన్షన్ సరిపోవడం లేదని, రానున్న రోజుల్లో వికలాంగుల పెన్షన్ పెంపు కోసం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మరోసారి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పోరాటంలో ప్రతి వికలాంగుడు, దివ్యాంగుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో



ఎమ్మార్పీఎస్ మండల గౌరవ సలహాదారు చిలక రాజు మాదిగ, విహెచ్పిఎస్ మండల నాయకులు సోంపల్లి పవన్ కళ్యాణ్‌తో పాటు వృద్ధులు, వితంతువులు, కొట్టే బాబు, చిలుక శోభ, బొడ్డు సులోచన, ఐలమ్మ, చిలుక విజయ్, చిలుక పవన్, బుర్ర శివ, శంకర్, ప్రకాష్, వనమ్మ తదితరులు పాల్గొన్నారు.

---

## శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**హైదరాబాద్,తెలుగు గళం:** శ్రీ శారదా ధామంలోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాల నడుమ నిర్వహించబడ్డాయి. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలు, మరియు సోదరభావాన్ని పెంపొందించేలా ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగింది.

ఈ వేడుకలు పాఠశాల ప్రిన్సిపల్ రమా విశ్వనాథన్ మరియు ఇంగ్లీష్ విభాగాధిపతి గోకులం ఆచార్యుల పర్యవేక్షణ, మార్గదర్శకత్వంలో ఎంతో క్రమశిక్షణతో జరిగాయి. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీస్తూ, వారిని సరైన మార్గంలో నడిపించడంలో ప్రిన్సిపల్ రమా విశ్వనాథన్ విశేష సేవలు అందించారు. ఆమె నేతృత్వంలో సాగిన ఈ కార్యక్రమం సోదర-సోదరీమణుల పవిత్ర బంధ విశిష్టతను ప్రతిబింబించింది.

కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన "కుటుంబం -- సంప్రదాయ విలువలు" నాటిక అందరినీ ఆకట్టుకుంది. కుటుంబ బంధాల మాధుర్యాన్ని, పరస్పర ఆత్మీయతను మరియు భారతీయ సంస్కృతి పరంపరను విద్యార్థులు తమ అద్భుత అభినయంతో హృద్యంగా ఆవిష్కరించారు. రాఖీ పండుగ విశిష్టతను వివరిస్తూ చిన్నారులు ఇచ్చిన సందేశం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది.అనంతరం అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలను చాటిచెప్పేలా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వర్ణరంజిత దుస్తులలో చిన్నారులు చేసిన సంప్రదాయ నృత్యాలు, సందేశాత్మక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ ప్రదర్శనలు కన్నులపండువగా సాగి ప్రతి ఒక్కరినీ మైమరిపించాయి.సృజనోత్సవం--2026 సంగీత విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతుల ప్రధానం జరిగింది. ప్రిన్సిపల్ రమా విశ్వనాథన్ విజేతలకు ప్రేమపూర్వకంగా బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థుల సంగీత ప్రతిభ మరింత వికసించాలని ఆకాంక్షిస్తూ, ఆమె అందించిన ప్రోత్సాహం చిన్నారులలో నూతన ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపింది.ఈ విధంగా శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన రాఖీ పౌర్ణమి సంబరాలు మరియు బహుమతుల ప్రదానోత్సవం విద్యార్థులు, ఉపాధ్యాయుల నడుమ ఆనందభరితమైన వాతావరణంలో అత్యంత విజయవంతంగా ముగిశాయి.

---

## సరస్వతీ విద్యా మందిరంలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

**తెలుగుగళం న్యూస్, పామిడి.**




పామిడి లోని సరస్వతి విద్యా మందిరం లో శుక్రవారం రాఖీ పండుగ ఘనంగా నిర్వహించారు. "నీవు నాకు రక్ష, నేను నీకు రక్ష మనం దేశానికి రక్ష "అంటూ ప్రతిజ్ఞ చేస్తూ రక్షబంధన్ కార్యక్రమం నిర్వహిస్తుంటే చూపరులను అక్కట్టుకుంది.పాఠశాల కార్యదర్శి బి.వి. రత్నమయ్య, ప్రధాన ఉపాధ్యాయులు

సిఆర్.శ్రీనివాసన్ ,జిల్లా బీజేపి యువమోర్చా ఉపాధ్యక్షులు రాజశేఖర్, చీమల దొడ్డప్ప, ఇతరులు రక్షబంధన్ మనుషుల మధ్య అనురాగలను చిలకరించే పండగ అని అన్నారు. సోదరికి కట్టే రంగు రంగుల దారం కాదని మాతృత్వపు అనురాగానికి సౌభ్రాత్వపు అభయమని అన్నారు.

---

## చెరువులు కనుమరుగవడంతోనే నగరాల్లో వరదలు: హైడ్రా కమిషనర్



**హైదరాబాద్,తెలుగు గళం:** నగరాల్లో వరదలు ముంచెత్తడానికి చెరువులు కనుమరుగవడమే ప్రధాన కారణమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. హైదరాబాద్‌లో 3, 4 సెంటీమీటర్ల వర్షం వచ్చినా రహదారులపైకి నీరు చేరుతోందని చెప్పారు. ఇక్కడ చెరువులు ఆక్రమణలకు గురవడంతోపాటు ఇన్ లెట్లు సరిగ్గా లేవన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 'అర్బన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. " దేశంలోని అనేక నగరాల్లో చెరువులు కబ్జాలకు గురవుతూ కనుమరుగవుతున్నాయి. దిల్లీలోని అనేక చెరువులు పార్కింగ్ యార్డులుగా మారాయి. హైడ్రా ద్వారా వస్తున్న మార్పులను గ్రహించి పశ్చిమ బెంగాల్ ఐఏఎస్ అధికారులు సంప్రదించారు. కోల్‌కతా నగరంలోనూ ఈ తరహా ఏజెన్సీ అవసరం ఉందని వారు పేర్కొన్నారు. తెలంగాణలో హైడ్రాను అడ్డుకునేందుకు ల్యాండ్ మాఫియాకు చెందిన వారు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా వాటన్నింటినీ దాటుకొని ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమాల్లో హైడ్రాపై అబద్ధాలు ప్రసారం చేస్తున్నారు. అనుమతి కలిగిన ఏ భవనాన్ని కూల్చే ప్రయత్నం జరగలేదు. కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను చట్ట ప్రకారమే రక్షిస్తున్నాం. రెండేళ్లలో 3,350 ఎకరాల కబ్జాలకు గురైన భూమిని రక్షించాం. దాని విలువ సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఉంటుంది" అని రంగనాథ్ అన్నారు.

